## క్లుప్తంగా

### 'అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలి'

ఆదిలాబాద్‌టౌన్: పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ గిరిజనులపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం ఆపాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులు పోడు సాగు చేస్తున్నారని, ప్రభుత్వ ప్రోద్బలంతో అధికారులు అమాయకులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలనలో పోడు సమస్య ఉత్పన్నం కాలేదని, గిరిజన, గిరిజనేతర పేదలు సాగు చేస్తున్న వేలాది ఎకరాల అటవీ భూమిని సర్వే చేసి పట్టాలు అందించారన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు దాడులు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో

ఇచ్చోడ: ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోరిగామలో 21 మందికి, అడేగామ కేలో 17 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా తిరిగి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. పత్రాలు పొందిన వారు వెంటన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

### ఎస్ఈటీఏ రాష్ట్ర కోశాధికారిగా మహేందర్



మహేందర్‌ను సన్మానిస్తున్న సంఘ బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా జిల్లాకు చెందిన గడుగు మహేందర్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో సంఘ బాధ్యులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్, శ్రీనివాస్, సంఘ బాధ్యులు సంజీవ్, చందన్ బాబు, నరేష్, గిరిప్రసాద్, సుజిత్, సంధ్యారాణి, సౌజన్య, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రిలయన్స్ ట్రెండ్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని షాపింగ్ మాల్‌లో శాలువాతో సత్కరించి మెడల్స్, గిఫ్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ చౌదరి, రాజశేఖర్, బోడిగం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి సీతక్కను కలిసిన ఆడే గజేందర్



మంత్రిని సన్మానిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో రాష్ట్ర మంత్రి సీతక్క, ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రాంత్ భూరియను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని తాజా రాజకీయ పరిణామాలు, పథకాల అమలుపై చర్చించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు పారదర్శకంగా అందేలా చూడాలని మంత్రి సీతక్క సూచించినట్లు గజేందర్ తెలిపారు.

## ఆహ్లాదం.. అస్తవ్యస్తం..!

ఆనవాళ్లు కోల్పోయిన వాటర్ ఫౌంటేన్



అలంకారప్రాయంగా మారిన చిన్నారుల రైలు



జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదం అందించాల్సిన గాంధీ పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇటీవలే పార్కు నిర్వహణ టెండర్లను దక్కించుకున్న గుత్తేదారు ఆదాయంపై చూపిస్తున్న శ్రద్ధ పార్కు నిర్వహణపై చూపడం లేదు. ఫలితంగా వాటర్ ఫౌంటేషన్లు అస్తవ్యస్తంగా మారగా పచ్చదనం ఆనవాళ్లు లేకుండా పోయాయి. చిన్నారులకు వినోదాన్ని అందించాల్సిన చుక్.. చుక్ రైలు నిర్వహణ లోపంతో మూలనపడింది. సంబంధిత అధికారులు దీని నిర్వహణపై ఎలాంటి దృష్టి సారించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

### విద్యార్థులను సర్కారు బడుల్లోనే చేర్పించాలి



మాట్లాడుతున్న అశోక్

బేల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాత కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం, నాణ్యమైన విద్యాబోధన, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శులు ఇస్తారి, శివ్వన్న, సభ్యులు కె.శంకర్, జగదీశ్, మహేందర్, చిన్నయ్య, అశోక్, నాందేవ్, భూమన్న, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

నార్నూర్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన బ్యాగులు, స్లాట్ నంబర్లు, బిల్లు రశీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విత్తనాల అమ్మకాలు కొనసాగించాలన్నారు. విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏవో కేంద్రే ఆకాష్, తదితరులు ఉన్నారు.



నార్నూర్: ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జాడి రాజలింగు

**రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి**

తాంసి: రైతులకు ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన పత్తి విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవీందర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయించడానికి నిల్వ చేసిన వివిధ రకాల విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. దుకాణం ఎదుట స్టాక్ వివరాలతో పాటు విత్తనాల ధరలను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు రశీదు సైతం అందించాలన్నారు.



తాంసి: స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏవో రవీందర్

**రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలి**

తలమడుగు: విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుచులపూర్, లింగి, సుంకిడి గ్రామాల్లోని సీడ్, ఫెర్టిలైజర్ దుకాణలను తనిఖీ చేశారు.



తలమడుగు: తనిఖీ చేస్తున్న ఏవో ప్రమోద్‌రెడ్డి

జైనథ్: విత్తనాల విక్రయంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ ఆత్రం నారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ అధికారి పూజ, ఏఎస్సై ఆత్మారామ్ ఉన్నారు.

# భక్తిమార్గంలో మానసిక ప్రశాంతత

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: భక్తిమార్గంలో పయనిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో ముత్యాల పోచమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంకోలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం చిచ్‌ధరి, ఖానాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు వేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశా కిరణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటిని గోరువెచ్చగా చేసుకుని తాగాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో ఏరియా సూపర్ వైజర్ బి.సుభాష్, పీహెచ్‌సీ సిబ్బంది శకుంతల, ప్రేమ్‌సింగ్, నారాయణ, శైలజ, సుష్మ, తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు అందజేస్తున్న వైద్యసిబ్బంది

# పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నార్నూర్: పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ రహీంపాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న నిర్వహించే బక్రీద్ పండుగను అందరూ కలిసిమెలిసి శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకుని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అఖిల్, మైనార్టీ పెద్దలు జాకురుల్లాఖాన్, షేక్ హుస్సేన్, మన్సూర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రహీంపాషా

# పేదలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

సిరికొండ: పేదలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం 3 కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

# 'ఇందిరమ్మ' మంజూరు పత్రాలు అందజేత

తలమడుగు: మండలంలోని సుంకిడి, తలమడుగు గ్రామాలకు రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ నసీర్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొదటి విడత కింద 69, రెండో విడతలో 415 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఇసుకకు సంబంధించిన టోకెన్లను తహసీల్దార్ కార్యాలయంలో తీసుకోవాలన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉంటే స్వయం సహాయక సంఘం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. ఇళ్ల మంజూరు కోసం దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శి గజానంద్, మాజీ ఎంపీటీసీ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రాలు అందిస్తున్న అధికారులు

### సొనాల తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇమ్రాన్‌ఖాన్

బోథ్: సొనాల నూతన తహసీల్దార్‌గా ఇమ్రాన్ ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మంచిర్యాల జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాకు ఇమ్రాన్‌ఖాన్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మండల వాసులు శుభాకాంక్షలు తెలిపారు.

### ముగిసిన క్రికెట్ పోటీలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిసాయి. ప్రథమ బహుమతి ఇచ్చోడ నైట్ రైడర్స్, ద్వితీయ బహుమతి ఇచ్చోడ ఇండియన్స్, తృతీయ బహుమతి ఇచ్చోడ కింగ్స్ గెలుపొందారు. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల నగదును క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గాడ్గే సుభాష్, నర్వాడే రమేశ్, రాథోడ్ అనిల్‌కుమార్, ముండే పాండురంగ్, చౌహాన్ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

### 'జొన్నల కొనుగోలు గడువు పొడిగించాలి'

నేరడిగొండ: జొన్నల కొనుగోలు తేదీని పొడిగించాలని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా సాగుతుండడంతో కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కురుస్తున్న వర్షాలకు జొన్నలు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం నిబంధనతో వాటిని ఆరబెట్టడం కష్టంగా మారిందన్నారు.

### ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించిన ఎంపీడీవో

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్‌లో శుక్రవారం ఎంపీడీవో రాజ్‌వీర్ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గణేశ్, గ్రామ పంచాయతి సెక్రెటరీ రాజురెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్



**పొంచి ఉన్న ప్రమాదం**

మండలంలోని గిన్నెర గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా అధి కారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– ఇంద్రవెల్లి

# ఖాళీ ప్రదేశాలే సిట్టింగ్ పాయింట్లు



రైల్వేగేట్ పక్కన గల వెంచర్‌లో మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు

రెబ్బెన: నిర్మానుష్యంగా ఉండే ఖాళీ ప్రదేశాలు మందుబాబులకు మంచి అడ్డాలుగా మారుతున్నాయి. అట్టి ప్రదేశాల్లో పగలు రాత్రి తేడా లేకుండా సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని హాయిగా మద్యం సేవిస్తున్నారు. మండల కేంద్రానికి అనుకుని ఉన్న వెంచర్లు, గోలేటి విలేజ్ పాత రోడ్ మందుబాబులకు మంచి అడ్డాలుగా మారాయి. పులికుంట వాగు సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్‌తో పాటు గోలేటి భీమన్న ఆలయ పరిసరాలను మందుబాబులు అడ్డాగా మార్చుకుని మద్యం సేవిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమైనప్పటికీ మందుబాబులు అవేం పట్టించుకోవడం లేదు. పోలీసులు సైతం ఈ విషయంపై అంతగా పట్టించుకోకపోవడం మందుబాబులకు కలిసివస్తోంది.

### ఆత్రం సుగుణకు సన్మానం

కైలాస్‌నగర్: ఏఐసీసీ ప్రకటించిన సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ సభ్యురాలిగా నియమితులైన ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణను శుక్రవారం కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సన్మానించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. శాలువాతో సత్కరించారు. ఆయన వెంట ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల అధ్యక్షులు కళ్లెం నారాయణ రెడ్డి, మల్యాల కరుణాకర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్, అమన్ ఫౌండేషన్ చైర్మన్ అర్భాత్, రాహుల్, రెండ్ల రాజన్న, తదితరులు ఉన్నారు.



సుగుణను సన్మానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

### ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

బోథ్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ధన్నూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావుల శంకర్ అన్నారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ధన్నూర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, మాడ ప్రశాంత్ కుమార్, సుకుమార్, దయాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం శంకర్